## 'సీఏఎస్ నోటిఫికేషన్ విడుదల చేయండి'

ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 20: ఉస్మానియా యూనివర్సిటీలో అధ్యాపకులకు ప్రమోషన్లు కల్పించేందుకు కెరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని అధికారులకు అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వారు.. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ... గత డిసెంబర్‌లో విడుదల కావాల్సి ఉన్న సీఏఎస్‌ను ఇప్పటికీ విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల ప్రమోషన్లు రావాల్సిన అధ్యాపకులు నష్టపోతున్నారని వాపోయారు. జేఎన్టీయూలో ఇటీవలే సీఏఎస్ నోటిఫికేషన్ విడుదలైందని గుర్తు చేశారు. దీనిపై అధికారులు తక్షణమే సరైన నిర్ణయం తీసుకుని నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన రిజిస్ట్రార్.. సీఏఎస్ అంశంపై వీసీతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## ● ఇన్‌చార్జి గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే తలసాని

తెలంగాణ రాష్ట్రానికి ఇన్‌చార్జి గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ నియమితులుకాగా.. బుధవారం రాజ్‌భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన.. ఇన్‌చార్జి గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. – బేగంపేట్, మార్చి 20

### ఘనంగా కడియం రాజు వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 20: ఏబీవీపీ పూర్వ జాతీయ కార్యదర్శి కడియం రాజు వర్ధంతి సభను ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన ఈ సభలో రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో 108 రోజుల జైలు జీవితం గడిపారని అన్నారు. తెలంగాణ ఉద్యమంతోపాటు వివిధ విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి, మహానగర్ ప్రముఖ్ డాక్టర్ రామకృష్ణ, గుంత లక్ష్మణ్, కాచం వెంకటేశ్వర్లు, డాక్టర్ మురళీ మనోహర్ పాల్గొన్నారు.

## లష్కర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలి

ఎమ్మెల్యే తలసానిని కోరిన లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు



లష్కర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన జిల్లా సాధన సమితి నాయకులు

సికింద్రాబాద్, మార్చి 20 : లష్కర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం లష్కర్ ప్రత్యేక జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు మారేడుపల్లిలోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు కోసం చేపట్టిన ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ... సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు 40 జీహెచ్ఎంసీ మున్సిపల్ డివిజన్లతో కూడిన నూతన జిల్లా ఏర్పాటుతో ప్రత్యేక నిధులు మంజూరుకు అవకాశం ఉంటుందని, ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కమ్మ సంఘాల సమాఖ్య ప్రతినిధులు, చిత్రంలో మంత్రి తుమ్మల, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి , తదితరులు

## సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు..

అమీర్‌పేట్, మార్చి 20 : కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలోని 60 కమ్మ సంఘాల ప్రతినిధులు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిల ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు కృతజ్ఞతగా త్వరలోనే హైదరాబాద్‌లో ఓ భారీ సభను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ఆ సభకు హాజరయ్యేందుకు సీఎం అంగీకరించారని కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి గంగవరపు శ్రీరామకృష్ణ ప్రసాద్, కోశాధికారి కండెపనేని రత్నాకర్‌రావులు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఒక ఎంపీ సీటును కమ్మవారికి కేటాయించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఏర్నేని రామారావుతో పాటు సమాఖ్యకు చెందిన వివిధ జిల్లాల కమ్మ సంఘాల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు బిక్కసాని నాగేశ్వర్‌రావు, శివన్నారాయణ, కోడె సతీష్‌కుమార్, వేమూరి సురేశ్‌కుమార్, బోజ్జా రంగారావు, మందడి కోటేశ్వర్‌రావు, పరిమి రామావతా రం, పోలవరపు శ్రీనివాస్ ప్రసాద్, సంకురాత్రి సతీష్‌లు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులకు ఓటరు నమోదుపై అవగాహన

బన్సీలాల్‌పేట్, మార్చి 20 : నగరంలోని వీధి వ్యాపారులకు ఓటరు నమోదుపై జీహెచ్ఎంసీ అధికారులు అవగాహన కల్పించారు. బేగంపేట్ సర్కిల్ యూసీడీ విభాగం డీపీఓ నీరజాదేవి, సీఓలు యాదయ్య, దయానంద్ లు తమ సిబ్బందితో కలిసి బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఉన్న వీధి వ్యాపారులతో మాట్లాడారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మరోసారి ఓటరు నమోదుకు అవకాశం కల్పించామని, ఆఫీసుల చుట్టూ తిరిగే ఇబ్బంది లేకుండా జీహెచ్ఎంసీ యాప్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని ఆమె అన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునేవారు రాజ్యాంగ బద్ధంగా లభించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు కోరారు. సికింద్రాబాద్ టౌన్ వెండర్స్ కమిటీ అధ్యక్షుడు జేమ్స్ జాన్, సభ్యులందరికి జీహెచ్ఎంసీ యాప్ డౌన్‌లోడ్ చేయించి, ఎలా ఓటరు నమోదు చేయాలో ఆయన వివరించారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద వీధి వ్యాపారులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## సీఎంను కలిసిన శ్రీ గణేశ్



సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత శ్రీ గణేశ్

కంటోన్మెంట్,మార్చి 20: కంటోన్మెంట్ ఉప ఎన్నిక నేపథ్యంలో రాజకీయం రసవత్తరంగా సాగుతుంది. ఈ క్రమంలో ఈనెల 19న కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శ్రీ గణేశ్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ తరపున ఎమ్మెల్యేగా పోటీచేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన శ్రీ గణేశ్ నారాయణన్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.అనూహ్యంగా హస్తం గూటికి చేరిన ఆయన బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా శ్రీ గణేశ్ మాట్లాడుతూ..ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయడం తోపాటు, నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని సూచించినట్లుగా పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయం మేరకు తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ చేతుల మీదుగా బుధవారం దళిత జర్నలిస్టు ఫోరం డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ రావు, డీజేఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి మీసాల ఎల్లేశ్, తదితరులు పాల్గొన్నారు. –బొల్లారం, మార్చి 20

జీరా బస్తీ వాసులతో మాట్లాడుతన్న కోట నీలిమ

## జీరా బస్తీ అభివృద్ధికి కృషి

బేగంపేట్ మార్చి 20: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని జీరా ప్రాంతంలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. బుధవారం ఆమె.. జీరా బస్తీ వాసులతో సమావేశమై వారి సమస్యలపై చర్చించారు. జీరా బస్తీలో ఉన్న పాత ఇండ్లు సుమారు 47 వరకు ఉన్నాయని, అవి పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో పక్కా ఇండ్లు నిర్మించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అలాగే మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## అక్రమ పార్కింగ్‌పై స్పెషల్ డ్రైవ్

అక్రమంగా నిలిపిఉంచిన వాహనాలను తరలిస్తున్న చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 20: తార్నాక మెట్రో స్టేషన్ సమీపంలోని రోడ్లపై అక్రమ పార్కింగ్ చేస్తున్న వాహనదారులపై చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను అక్కడి నుంచి తొలగించి, ప్రయాణికులకు అడ్డంకులు సృష్టించినందుకు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. మెట్రోను వినియోగించుకునేవారు పార్కింగ్‌లోనే తమ వాహనాలు నిలపాలని సూచించారు.

## సమాజ మనుగడలో ఊరపిచ్చుకల పాత్ర

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సైంటిస్టు రవీందర్‌రెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 20: సమాజ మనుగడలో ఊరపిచ్చుకల పాత్ర ఎంతో ఉందని,వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిదని ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, అఖిల భారత సకసేరుక చీడపీడల యాజమాన్య విభాగం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ జడ్పీ పాఠశాలలో ఊరపిచ్చుకల జీవన విధానంపై ఐ లవ్ స్పారోస్ బృందంతో అవగాహన నిర్వహించారు. పిచ్చుకలు గతంలో పంటలపై చీడ పీడలను నాశనం చేసి రైతుకు అండగా ఉండేవన్నారు. టెక్నాలజీ పెరిగే కొద్దీ అవి పిచ్చుకలు అంతరించిపోతున్నాయన్నారు. స్పారోస్ కోసం కృత్రిమ పిచ్చుక గూళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. పిచ్చుకలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అనురాధ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న 'జానెడు పొట్ట కోసం నాటిక ప్రదర్శన

**మల్లాపూర్, మార్చి 20 :** రాష్ట్ర చలన చిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ సౌజన్యంతో తెలుగు వెలుగు సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం జానెడు పొట్ట కోసం సందేశాత్మక నాటిక ప్రదర్శనను నిర్వహించారు. రక్త కన్నీరు నాగభూషణం, బళ్లారి రాఘవ అవార్డు గ్రహీత మాడుగుల వెంకట కృష్ణమోహన్ రచన, నటన, దర్శకత్వం వహించిన ఈ నాటక ప్రదర్శనలో నటీ నటులు ఎంతో చక్కగా తమ నటనను నిరూపించుకొని చూపరులను ఆకట్టుకున్నారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటీమణి జి. మనుప్రియకు కళాపోషకులు ఎం.వి.కె మూర్తి రూ. 7,116 చేయూతగా అందజేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా యువ కళావాహిణి అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, రచయిత నటుడు డాక్టర్ ఓలేటి శ్రీనివాసాచార్యులు, నటవర్గం మనుప్రియ, ఐరేని రమేష్ గౌడ్, సత్యనారాయణ, పరమేశ్వరచారి, మాడుగుల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## 22న పశుపోషణపై అవగాహన సదస్సు

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 20: పశుపోషణ యాజమాన్యంపై రాష్ట్రస్థాయి సమావేశం ఈనెల 22న జరుగనుందని పశుంవర్ధక విస్తరణ విభాగం అధిపతి ప్రొఫెసర్ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, భారత జాతీయ ఉత్పాదక మండలి(ఎన్‌పీసీ) ఆధ్వర్యంలో సమగ్ర ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా స్థానిక విస్తరణ విద్యాసంస్థ(ఈఈఐ) ఆడిటోరియంలో ఏర్పాట్లు చేశారు. విశ్వవిద్యాలయ పరిశోధనా విద్యార్థులు, అధ్యాపకులు, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొంటారు. సుస్థిర పశు ఉత్పాదకత యొక్క వివిధ అంశాలపై లోతైన మేథో మథనానికి, లోతైన చర్చలకు వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నా రు. కార్యక్రమానికి పీవీఎన్ఆర్ ఉపకులపతి అదర్‌సిన్హా అధ్యక్షత వహిస్తారు. ఐసీఆర్ఓ డైరెక్టర్ రాజీవ్‌రంజన్, రిజిస్ట్రార్ ఎం.జ్ఞానప్రకాశ్, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

**ఉప్పల్, మార్చి 20:** ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నామని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్‌లోని పరమేశ్వర్ రెడ్డి నివాసంలో పలు కాలనీలకు చెందిన కాలనీవాసులు బుధవారం ఆయనను కలిశారు. ఈమేరకు సమస్యలు పరిష్కరించేవిధంగా చూడాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు తోడ్పాటు అందిస్తామన్నారు. సమస్యలను గుర్తించి, వాటికి తగిన పరిష్కార చర్యలు చేపట్టడానికి నిధులు తీసుకువస్తామన్నారు.

### సమస్యలు పరిష్కరించండి

**కాప్రా:** కాప్రాడివిజన్‌లో ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డిని డివిజన్ కార్పొరేటర్ స్వర్ణ రాజు కోరారు. బుధవా రం ఉప్పల్‌లో పరమేశ్వరెడ్డిని ఆయ న నివాసంలో కలిసి కాప్రాడివిజన్‌లో నెలకొన్న సమస్యలపై చర్చించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- నార్త్‌జోన్ ట్రాఫిక్-1 కమిషనర్ సుబ్బారాయుడు, అదనపు ట్రాఫిక్ డీసీపీ రంగారావు
- బేగంపేట్‌లో ట్రాఫిక్ పోలీస్ బొమ్మ ఆవిష్కరణ

బేగంపేట్ వరుణ్ మోటార్స్ సమీపంలో ట్రాఫిక్ పోలీస్ బొమ్మను ఆవిష్కరించిన అనంతరం దాని ముందు ట్రాఫిక్ ఉన్నతాధికారులు

బేగంపేట్ మార్చి 20: ఉత్తర మండలం ట్రాఫిక్ పోలీసులు బేగంపేట్‌లో ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మొట్ట మొదటిసారిగా ట్రాఫిక్ పోలీసు బొమ్మను ఏర్పాటు చేశారు. వాహనదారులను ప్రమాదాల నుంచి కాపాడేందుకు ఇలాంటి వినూత్న కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయనే ఉద్దేశంతో వారు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

వాహనదారులను అప్రమత్తం చేస్తూ ప్రమాదాలను నివారించేందుకు బేగంపేట్ ప్రధాన రహదారి వరుణ్ మోటార్స్ సమీపంలో అచ్చం ట్రాఫిక్ పోలీసే విధులు నిర్వహిస్తున్నట్టు ఓ బొమ్మను ఏర్పాటు చేశారు. వరుణ్ మోటార్స్‌వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఆ ట్రాఫిక్ బొమ్మను బుధవారం నార్త్ జోన్ ట్రాఫిక్-1 కమిషనర్ సుబ్బారాయుడు, అదనపు ట్రాఫిక్ డీసీపీ రంగారావు, ఏసీసీ శంకర్రాజు, వరుణ్ మోటా ర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్‌సీ రాజు, జనరల్ మేనేజర్ కృష్ణకుమార్, బ్రాంచ్ మేనేజర్ సుమంత్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఉన్నతాధికారులు మాట్లాడుతూ... వాహనదారుల భద్రతే తమ ప్రథమ కర్తవ్యమ్మని అన్నారు. ట్రాఫిక్ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వాహనదారులు కూడా వారి వారి కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని రోడ్లపై జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. ప్రతి వాహనదారుడు నిర్ణీత వేగంతో వెళ్లాలని చెప్పారు. వరుణ్ మోటార్స్ బ్రిడ్జివద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా వాహనదారులను అప్రమత్తం చేసేందుకు ఇక్కడ ట్రాఫిక్ పోలీసులాగే ఉండే బొమ్మను ఏర్పాటు చేశామన్నారు. బొమ్మను చూసిన వెంటనే వాహనదారులు అప్రమత్తం అవుతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## విద్య కాషాయీకరణకు కేంద్రం కుట్ర

తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

హిమాయత్‌నగర్, మార్చి 20: విద్యను కాషాయీకరణ చేసేందుకే కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం తీసుకువచ్చిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. శాస్త్రీయ విద్య విధానం కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యను ప్రైవేటీకరణ చేయడంతోపాటు ప్రభుత్వ విశ్వ విద్యాలయాలను నిర్వీర్యం చేసేందుకు విదేశీ విశ్వ విద్యాలయాలకు అనుమతి ఇచ్చారని విమర్శించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసేందుకు కేంద్రం కుటిల ప్రయత్నం చేస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో విఫలమైన బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, నాయకులు ఇటికాల రామకృష్ణ, రఘురాం, క్రాంతి, నరేశ్, వెంకటేశ్, నెల్లి సత్య, రాజు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా రైల్వే డిగ్రీ కళాశాల 47వ వార్షికోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 20: తార్నాకలోని రైల్వే డిగ్రీ కళాశాల 47వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలు ప్రారంభం కాగానే ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.భాష్యం వార్షిక నివేదికను సమర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన దక్షిణమధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్, కళాశాల చైర్మన్ కిశోర్‌బాబు మాట్లాడుతూ.. కళాశాలలో చదివిన ఎంతో మంది గొప్పగొప్ప స్థానాలకు చేరుకున్నారని అన్నారు. కళాశాల విద్యార్థులు విద్యతోపాటు ఇతర రంగాల్లోనూ ప్రతిభను కనబరుస్తున్నారని ప్రశంసించారు. ఈ కళాశాలకు ఎంతో చరిత్ర ఉందని, దేశంలో ఎక్కడ కూడా రైల్వే శాఖకు డిగ్రీ కళాశాల లేదని, కేవలం దక్షిణ మధ్య రైల్వేకు మాత్రమే, అదీ సికింద్రాబాద్‌లోనే ఉందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాష్యం మాట్లాడుతూ.. విద్యార్థులను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో అనేక బహుమతులు సాధించారని గుర్తు చేశారు. కళాశాలలో త్వరలో బాస్కెట్‌బాల్ గ్రౌండ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. కళాశాలలో చేరే పేద విద్యార్థుల పరీక్షా ఫీజు, కళాశాల ఫీజులను సైతం చెల్లించేందుకు కల్నల్ నగేశ్ చంద్రగుప్తా ముందుకు వచ్చి.. దాదాపు రూ.తొమ్మిది లక్షలను విరాళంగా అందజేశారని వివరించారు. విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం కళాశాల సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ సోపన్ కాశీనా థ్, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.




కళాశాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అతిథులు

## దేశంలో అప్రజాస్వామ్య పాలన నడుస్తోంది..

మాట్లాడుతున్న భూపాల్‌గౌడ్

ఖైరతాబాద్, మార్చి 20: దేశంలో ప్రస్తుతం అప్రజాస్వామ్య పాలన నడుస్తున్నదని ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ పీపుల్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షుడు భూపాల్ గౌడ్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడు తూ.. ప్రతి ఎన్నికల్లో ఓట్లు కొనడం, అమ్ముకోవడం పరిపాటిగా మారిందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. ఓట్లు కొన్న వారి ఎన్నికను రద్దు చేయాలని, క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వారిని శిక్షించాలని, ఈ విషయంపై దేశంలోని 140 కోట్ల మంది ప్రజల పక్షాన తాను సుప్రీం కోర్టులో పిల్ వేశానని తెలిపారు. 76 ఏండ్లుగా రాజకీయం అనేది దేశంలో అవినీతిమయంగా మారిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ద్వారా ప్రజలే తమకు తాముగా అవినీతిని ప్రక్షాళన చేయాలని పిలుపునిచ్చారు.

## 'రాగిడి' గెలుపునకు కృషి చేయాలి

మల్కాజిగిరి, మార్చి 20: బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిని ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు అంద రూ కృషి చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సూచించారు. బుధవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ ఎన్నికల ప్రచార నిర్వహణపై ఎమ్మెల్యే మహిళా నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని అన్నారు. తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిందని, ఎంపీ ఎన్నికలో పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించడానికి అందరం కలసి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మటి అరుంధతి, వైశాలి, ఎంవీ.అప్పరావు తదితరులు పాల్గొన్నారు.